సమాచారం

నేడు హెచ్‌సీయూలో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బుధవారం ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జీ–20 యూనివర్సిటీ కనెక్ట్ ఎంగేజింగ్ యంగ్ మైండ్స్ కార్యక్రమంలో భాగంగా 'జీ–20 అండ్ రోల్ ఆఫ్ ఇండియన్ ప్రెసిడెన్సీ' అనే అంశంపై యూఎన్‌లో మాజీ భారత శాశ్వత ప్రతినిధి, హైదరాబాద్ కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు హెచ్‌సీయూ క్యాంపస్‌లోని జాకిర్ హుస్సేన్ లెక్చర్‌హాల్ కాంప్లెక్స్‌లో ఈ ఉపన్యాస కార్యక్రమం నిర్వహిస్తారు.

రూ.10 కోట్ల స్కాలర్‌షిప్స్ అందించనున్న ఆర్వీయూ

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ విద్యా సంస్థ ఆర్వీ విశ్వవిద్యాలయం(ఆర్వీయూ) ప్రతిభావంతులైన విద్యార్థులకు అందించే మెరిట్ స్కాలర్‌షిప్ కోసం రూ.10కోట్లు కేటాయించింది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో మొదలయ్యే విద్యా సంవత్సరానికి గాను బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఏఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, లిబరల్ ఆర్ట్స్ అండ్ సైన్స్, లా తదితర కోర్సులకు చెందిన 500కు పైగా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ విద్యార్థులకు దీని ద్వారా ప్రయోజనం కలుగుతుందన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు https://admissions.rvu.edu.inలో దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు.

హెచ్‌సీయూలో రష్యా–ఉక్రెయిన్ యుద్ధంపై ఉపన్యాసం



మాట్లాడుతున్న ప్రొ.సంజయ్‌కుమార్ పాండే

రాయదుర్గం: ప్రస్తుత రష్యా–ఉక్రెయిన్ వివాదం స్లావిక్ ప్రపంచ సూక్ష్మ చరిత్ర ఫలితమని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్, రష్యన్ అధ్యయనాల నిపుణుడు ప్రొఫెసర్ సంజయ్‌కుమార్ పాండే పేర్కొన్నారు. హెచ్‌సీయూ పొలిటికల్ సైన్స్ విభాగాన్ని సందర్శించిన ఆయన 'రష్యా–ఉక్రెయిన్ యుద్ధం–దాని చిక్కులు' అనే అంశంపై ఉపన్యాసం చేశారు. ఉపన్యాసం అనంతరం ఆయన విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ.23 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వేగవంతంగా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలో మహానగరాన్ని తలపించేలా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మల్లెపల్లి లలితాసోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్ వివిధ పార్టీల కౌన్సిలర్లు లచ్చిరాం నాయక్, బాలజీ, మయూరి రాజుగౌడ్ జ్యోతి, శంషాబాద్ రాజు, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

సాయిచరణ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

రామచంద్రాపురం(పటాన్‌చెరు): షికాగోలో నల్ల జాతీయుల కాల్పుల్లో గాయపడిన భారతి నగర్ డివిజన్‌కు చెందిన సాయి చరణ్ కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరామర్శించారు. సాయి చరణ్ ఆరోగ్య పరిస్థితిని, సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరపున సాయిచరణ్ కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పన్నులు తగ్గించాలని నిరసన



ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు, ప్రజలు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో పెంచిన ఆస్తి పన్నులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ కౌన్సిలర్ హన్మంత్‌రెడ్డి, కార్మిక నేత వరప్రసాద్‌రెడ్డి మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పన్నులు పెంచడంతో పేదలపై భారం పడుతుందన్నారు. వెంటనే పెంచిన పన్నులు తగ్గించాలన్నారు. పన్నులు తగ్గించకపోతే ప్రతినిత్యం దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆర్వో శ్రీధర్‌రావుకు వినతి పత్రం అందించారు. రాజ్‌గోపాల్, రమణయ్య, చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడిసెల కూల్చివేత.. తీవ్ర ఉద్రిక్తత

గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌కు వెళ్లే రోడ్డుపై ఉన్న గుడిసెల కూల్చివేత

- కోర్టు ఆదేశాలతో జీహెచ్ఎంసీ చర్యలు
- భారీ బందోబస్తు మధ్య 153 గుడిసెలు నేలమట్టం
- ప్రభుత్వం అన్యాయం చేసిందంటూ బాధితుల ఆవేదన
- అడ్డుకునేందుకు ప్రయత్నించిన బీజేపీ నేత రవికుమార్‌యాదవ్‌తో పాటు పలువురి అరెస్ట్



రవికుమార్‌యాదవ్‌ను అదుపులోకి తీసుకుని వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు



గచ్చిబౌలి జీపీఆర్ఏ రోడ్డులో ఫుట్‌పాత్‌పై వెలసిన గుడిసెలను కూల్చివేస్తున్న దృశ్యం



రోడ్డు మధ్యలో సామగ్రితో కూర్చున్న బాధితులు

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై ఉన్న గుడిసెలను జీహెచ్ఎంసీ అధికారులు భారీ బందోబస్తు మధ్య కూల్చివేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన బీజేపీ నేతలను అరెస్ట్ చేయడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. హైకోర్టు ఆదేశాలతోనే కూల్చివేతలు చేపట్టినట్లు శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు తెలిపారు. రెండు దశాబ్దాలుగా ఫుట్‌పాత్‌పై గుడిసెలు వేసుకుని నివసిస్తున్నామని, ప్రభుత్వం తమకు తీరని అన్యాయం చేసిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా గుడిసెలు కూల్చివేయడం పాశవిక చర్య అని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్‌యాదవ్ ఆరోపించారు. శేరిలింగంపల్లి టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి భారీ బందోబస్తు మధ్య గుడిసెల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. రవికుమార్‌యాదవ్‌తో పాటు మరికొందరు నేతలు కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించగా అరెస్ట్ చేసి నార్సింగి పీఎస్‌కు తరలించారు. బాధితులు ఇందిరానగర్ ప్రధాన రహదారిపై బైఠాయించేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. గొడవకు దిగిన కొందరు బాధితులను అరెస్ట్ చేసి పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అంతకు ముందు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో పాటు బీజేపీ నేతలు రాధాకృష్ణయాదవ్, ఎల్లేష్, హన్మంత్‌నాయక్‌లను అరెస్ట్ చేసి నార్సింగి పీఎస్‌కు తరలించారు. కూల్చివేతల నేపథ్యంలో రోడ్డు మధ్యలోనే సామగ్రి పెట్టుకొని గుడిసెవాసులు చెట్ల కింద కూర్చున్నారు. శేరిలింగపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తమకు న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని బాధితులు చెబుతున్నారు.

గుడిసెల నేపథ్యం ఇదీ..

జీపీఆర్ఏ క్వార్టర్స్‌కు వెళ్లే రోడ్డులో ఇరువైపులా 2002లో గుడిసెలు వెలిశాయి. మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్, మెదక్, రంగారెడ్డి తదితర జిల్లాల నుంచి వచ్చిన వలస కూలీలు ఇక్కడ గుడిసెలు వేసుకున్నారు. ఫుట్‌పాత్‌పై ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనదారుల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ఈ క్రమంలోనే కొందరు గుడిసెలు తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. ఇక్కడ నివసించే వారంతా కూలి పనులు, ఇళ్లలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొందరు అద్దె చెల్లించి ఈ గుడిసెలలో ఉంటున్నారు.

నెల రోజుల క్రితమే నోటీసులు..

జీపీఆర్ఏ క్వార్టర్స్ రోడ్డు ఫుట్‌పాత్‌పై వెలసిన 153 గుడిసెలకు నెల రోజుల క్రితమే నోటీసులు జారీ చేసినట్లు శేరిలింగంపల్లి సర్కిల్ టీపీఎస్ రమేష్ పేర్కొన్నారు. ఫుట్‌పాత్‌పై వెలసిన గుడిసెలను తొలగించాలని హైకోర్టు ఆదేశాలిచ్చిందని, ఈ క్రమంలోనే గుడిసెలను ఖాళీ చేయాలని నోటీసులు అందజేసినట్లు తెలిపారు.



రోడ్డుపై బైఠాయించేందుకు ప్రయత్నిస్తున్న బాధితులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రత్యామ్నాయం చూపకపోవడం అమానుషం

పొట్ట చేతపట్టుకొని వచ్చిన వలస కూలీల గుడిసెలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం అమానుషమని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గుడిసెలు కూల్చివేయాల్సి వస్తుందని తెలిసినప్పటికీ వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎందుకు కేటాయించలేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

–రవికుమార్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు



ప్రభుత్వం అన్యాయం చేసింది..

పదేళ్లుగా గుడిసెల్లోనే నివాసం ఉంటున్నాం. ఇప్పటికే తమ సమస్యపై ఎమ్మెల్యే గాంధీకి వివరించాం. ఏమీ కాదని ఆయన హామీ ఇచ్చినప్పటికీ గుడిసెలు కూల్చివేసి మమ్మల్ని రోడ్డున పడేశారు. ప్రభుత్వం గుడిసెల్లో ఉంటున్న పేదలకు అన్యాయం చేసింది. ప్రజాప్రతినిధులు స్పందించి న్యాయం చేసే వరకు రోడ్డుపైనే ఉంటాం.

– అన్నపూర్ణ, బాధితురాలు



గుడిసెలను నేలమట్టం చేసిన దృశ్యం

'కంటి వెలుగు' కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: కంటి వెలుగు శిబిరంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులను ఆదేశించారు. మియాపూర్‌లోని మయూరినగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచిత కంటి వైద్యం అందించేందుకు ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కిరణ్‌యాదవ్, చంద్రిక ప్రసాద్‌గౌడ్, శ్రీనివాస్‌రాజు, మహ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి నిధులు కేటాయించాలని వినతి



బీసీ కమిషన్ సభ్యులకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఓబీసీఎస్ఏ ప్రతినిధులు

రాయదుర్గం: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల అభివృద్ధి, సంక్షేమానికి భారీగా నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులకు ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఓబీసీఎస్ఏ) బృందం మంగళవారం వినతిపత్రం అందజేసింది. బీసీ కమిషన్ కార్యాలయంలో వారు అధికారులను కలిశారు. ఈ సందర్భంగా గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ వద్ద ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.శివకుమార్ మాట్లాడుతూ.. త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలన్నారు. బీసీలకు ప్రత్యేక సబ్సిడీలతో కూడిన సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. బీసీ విద్యార్థులకు హాస్టల్, మెస్ ఫీజు రూ.1,500 నుంచి మూడు వేలకు పెంచాలని, కొత్తగా బీసీ కళాశాలలు, ఇంజనీరింగ్ కాలేజీలు, మహిళలకు ప్రత్యేకంగా కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీలపై జరుగుతున్న దాడులను నివారించడానికి ప్రత్యేక చట్టం చేయాలని ఆయన అన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మాదాపూర్: అనుమతులు లేకుండా భవనాలు, షెడ్లను నిర్మిస్తే ఉపేక్షించేది లేదని చందానగర్ టీపీఎస్ మధు హెచ్చరించారు. మాదాపూర్‌లో మంగళవారం సిబ్బందితో కలిసి అక్రమంగా నిర్మిస్తున్న భవనాల పిల్లర్లను, షెడ్‌లను కూల్చివేశారు. ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే ఆ నిర్మాణాలను కూల్చివేసి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేసిన కమాండెంట్ మురళీకృష్ణ, ఇతర అధికారులు

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ 8వ బెటాలియన్ అధికారులు, సిబ్బంది నయశ్రీ ఆర్ఫనేజ్ హోమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది విద్యార్థులకు నోట్ బుక్స్, రైస్ బ్యాగ్‌లు, పండ్లను పంపిణీ చేశారు. బెటాలియన్ సీ కంపెనీ సి బృంది వార్షిక రీఫ్రెషర్ కోర్సులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు మురళీకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సత్యనారాయణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, సీ కంపెనీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ప్రశాంత వాతావరణం ఉంది

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, క్యాంపస్ ప్రశాంతంగా ఉందని హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 21న ఎలాంటి అనుమతి లేకుండా 'ఇండియా: ది మోడీ క్వశ్చన్' అనే డాక్యుమెంటరీని ప్రదర్శించారు. సమాచారం అందుకున్న భద్రతా బృందం, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ వేదిక వద్దకు చేరుకొని డాక్యుమెంటరీ ప్రదర్శన నిలిపివేయాలని నిర్వాహకులకు సూచించారు. అయితే నిర్వాహకులు అందుకు అంగీకరించకుండా కొంతమంది విద్యార్థుల సమక్షంలో డాక్యుమెంటరీ ప్రదర్శన కొనసాగించారని పేర్కొన్నారు. క్యాంపస్‌లో ఈవెంట్ నిర్వహించాలనుకునే విద్యార్థి సంస్థ డీన్ విద్యార్థుల సంక్షేమం ద్వారా ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమం శాంతియుతంగా ముగిసినప్పటికీ తదుపరి చర్యల కోసం ఈవెంట్‌పై నివేదిక అందజేయాలని విశ్వవిద్యాలయం కోరిందన్నారు.

పాత నేరస్తులకు పోలీసుల కౌన్సెలింగ్

మియాపూర్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలను అరికట్టేందుకు పాత నేరస్తులు, అనుమానితులతో మియాపూర్ పోలీసులు మంగళవారం కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ తిరుపతిరావు, డీఐ కాంతారెడ్డి, ఎస్ఐ యాదగిరిరావు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఆటోల దొంగతనాలు, హత్య కేసులు తదితర క్రిమినల్ కేసుల్లో వారి ప్రమేయం ఉండకూడదని హెచ్చరించారు. మరోసారి నేరం రుజువైతే కఠిన చర్యలు తప్పవన్నారు. ఏ సమయంలోనైనా స్పందించాలని, ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతుంటామని తెలిపారు. అనంతరం ఏఏ పనులు, ఎక్కడెక్కడ నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడు పిలిచినా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పీవీబీ వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టీఎన్‌జీఓ కాలనీ ఫేజ్–1, ఫేజ్–2 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

చెరువుల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



మియాపూర్: నియోజకవర్గంలో చేపట్టిన చెరువుల సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెరువుల సుందరీకరణ, అభివృద్ధి పనులపై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పనిచేసి సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నియోజకవర్గంలో అన్ని చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడా చెరువులు కబ్జాకు గురికాకుండా సర్వే నిర్వహించి కంచె ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఎస్ఈ ఆనంద్, ఈఈ నారాయణ, డీఈ నళిని, ఏఈ పావని, చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన..

మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీలో రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో సీసీ రోడ్డు పనులు చేపట్టి సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

పాదచారుల రక్షణకు బాటలు

- శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో వేగంగా ఫుట్‌పాత్‌ల నిర్మాణం
- ఇప్పటికే పలు రోడ్లపై వేగంగా జరుగుతున్న నిర్మాణ పనులు
- త్వరలోనే అన్ని ప్రధాన రహదారులపై ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి ప్రణాళికలు



ప్రధాన రోడ్లపై చురుగ్గా సాగుతున్న ఫుట్‌పాత్ నిర్మాణ పనులు

గచ్చిబౌలి: రోడ్లపై పాదచారులు నడిచి వెళ్లేందుకు ఫుట్‌పాత్‌లు చాలా అవసరం. వేగంగా వచ్చే వాహనాల నుంచి ఎలాంటి ప్రమాదం లేకుండా వెళ్లేందుకు పట్టణ, నగర ప్రాంతాల్లో ప్రధాన రోడ్లకు ఇరువైపులా తప్పనిసరిగా ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేస్తారు. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి చర్యలు ప్రారంభించారు. ప్రస్తుతం వీటి నిర్మాణం వడివడిగా సాగుతోంది. త్వరలోనే ప్రజలకు ఫుట్‌పాత్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. కొత్తగా జంట సర్కిళ్ల పరిధిలో ఆరు రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేయాలని నిర్ణయించి పనులు చేపట్టారు. ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఆయా డివిజన్ల కార్పొరేటర్ల సూచనల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు మొదటి విడతలో ఈ రోడ్లను ఎంపిక చేసి ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నారు.

పాదచారులు, వాకర్లకు ఉపయోగకరం..

- ప్రస్తుతం నిత్యం వాకింగ్ చేయాలనే భావన ప్రతి ఒక్కరిలో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు పార్కులు, చెరువులు, కుంటల సుందరీకరణతో పాటు వాకింగ్ ట్రాక్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారు.
- ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను నిర్మిస్తే పాదచారులతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్లు వినియోగించుకుంటారు.
- మొదటి విడతలో ఆరు రోడ్లపై ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టగా మలివిడతలో అన్ని డివిజన్లకు ప్రాధాన్యత ఇస్తూ నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
- ఫుట్‌పాత్‌ల నిర్మాణంతో రోడ్ల పక్కన పరిశుభ్రత నెలకొనే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న చెట్లను తొలగించకుండానే ఫుట్‌పాత్‌లను నిర్మిస్తున్నారు.
- ప్రస్తుతం రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి పెంచగా అవి కాస్తా ప్రస్తుతం చెట్లుగా మారాయి. అయితే వాటిని తొలగించకుండానే ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేస్తున్నారు.
- ఫుట్‌పాత్‌ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను అనువైన ప్రాంతంతో ఏర్పాటు చేసేందుకు అధికారులు ఆలోచన చేస్తున్నారు.

శేరిలింగంపల్లి పరిధిలో కొత్తగా నిర్మిస్తున్న ఫుట్‌పాత్‌లు ఇవే..

డివిజన్ పేరు	ఎక్కడి నుంచి	ఎక్కడి వరకు	ఎన్ని కిలోమీటర్లు
కొండాపూర్	గచ్చిబౌలి జంక్షన్	కొత్తగూడ జంక్షన్ వరకు	2.20 కిలోమీటర్లు
కొండాపూర్	కొత్తగూడ జంక్షన్	గచ్చిబౌలి జంక్షన్ వరకు	2.30 కిలోమీటర్లు
శేరిలింగంపల్లి	బొటానికల్ గార్డెన్	మసీదుబండ పాఠశాల	2.40 కిలోమీటర్లు
శేరిలింగంపల్లి	మసీదుబండ పాఠశాల	బొటానికల్ గార్డెన్	2.40 కిలోమీటర్లు
గచ్చిబౌలి	ఇందిరానగర్	బ్రహ్మకుమారీస్ రోడ్డు	1.60 కిలోమీటర్లు
చందానగర్	బజాజ్ ఎలక్ట్రానిక్స్	మంగళవారం మార్కెట్	1.60 కిలోమీటర్లు

దశలవారీగా అన్ని రోడ్లకు ఫుట్‌పాత్‌లు



శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. మొదటి విడతలో జంట సర్కిళ్ల పరిధిలో ఆరు చోట్ల ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు. అవి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం రోడ్లపై పెరిగిన రద్దీ దృష్ట్యా పాదచారుల సౌకర్యం మేరకు ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేయాల్సిన అవసరాన్ని అధికారులు గుర్తించారు. భవిష్యత్తులో మరిన్ని రోడ్లపై వీటిని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

– ఆరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే

